# ప్రాణం

స్కూటర్ తాళాలు ఓవరాల్ జేబులో వేసుకుని స్టెత్ ఊపుకుంటూ మెడికల్ వార్డువైపు వచ్చాడు డాక్టర్ రవి. గేటు దగ్గర కర్ర అదిలిస్తున్న గేట్‌మన్ రవిని చూచి ప్రక్కకు తప్పుకున్నాడు.

షర్ట్ స్లీవ్ పైకిలాగి వాచ్‌వంక చూచిన రవి 'బాబోయ్ అసిస్టెంట్ వచ్చేసుంటాడు. ఆలస్యంగా వచ్చినందుకు ముఖం వాచేలా చీవాట్లు తప్పవు' అనుకుంటూ గబగబ మెట్లెక్కసాగాడు.

ఛ! ఛ! యీ హౌస్ సర్జన్ పనంత దరిద్రపుపని మరొకటి లేదు. అందరికీ లోకువే. అందరూ ఆర్డర్లు వేసేవారే. చీఫ్ దగ్గర్నుంచి అసిస్టెంట్స్, పోస్ట్ గ్రాడ్యుయేట్స్, స్టాఫ్ నర్సులు, ఖర్మకాలి, తోటీలు, ఆయాలు కూడా ప్రతిపనికి, ప్రతిచిన్న సమస్యకి హౌస్‌సర్జన్నే, రోగికి దగ్గొచ్చినా, ఒకటికి పోసుకోక పోయినా, ఎక్కువసార్లు పోసుకున్నా ఆ ఎమర్జన్సీని ముందు దిగ్రేట్ హౌస్‌సర్జన్‌గారు చూడాల్సిందే. యింత అరవ చాకిరీ చేస్తున్నా ఎందుకూ చాలని స్టయిఫండ్! ఏ మాత్రం ఆత్మవిశ్వాసం కలిగించని అనుభవం. నిపుణతను పెంచని పని..... ఆలోచిస్తూ రెండో అంతస్తులో అడుగుపెట్టాడు రవి.

"డాక్టర్! అసిస్టెంట్ వచ్చేసారు. మీరింకా రాలేదని కోపంగా వున్నారు." ఎదురొచ్చిన స్టూడెంట్ నర్స్ చావు కబురు చల్లగా చెప్పేసి క్రిందికి దిగిపోయింది. కర్చీఫ్ తీసి ముఖం మీది చిరుచెమటలను తుడుచుకుని వార్డులోకి అడుగు పెట్టాడు రవి. రెండో హౌస్‌సర్జన్, పోస్టుగ్రాడ్యుయేట్ లీవ్‌లో ఉండడంవల్ల అసిస్టెంట్ డాక్టర్ రంగనాధరావు, రవి ఇంకా రానందుకు కారాలు మిరియాలు నూరుతున్నాడు.

"గుడ్ మార్నింగ్ సర్! సారీ సర్! కొంచెం అర్జంట్ పనితగిలి ఆలస్యం అయింది సర్! అయామ్ ఎక్స్‌ట్రీమ్లీ సారీసర్" రవి భామాకలాపం చూచి అసిస్టెంట్‌కి నవ్వొచ్చినా పారిపోతున్న కోపాన్ని బలవంతాన ఆపాడు.

"మీకేమయ్యా! దర్జాగా పదిగంటలకు దిగుతారు ఏదో మొక్కుతీర్చుకున్నట్టు డ్యూటీ చెయ్యడం తప్పితే పేషెంట్స్ గురించి బాధవుంటే గదా! మోస్ట్ ఇరెస్పాన్సిబుల్ పీపుల్" ఆసిస్టెంట్ దులుపుడుకి ఒళ్ళుమండి పోతూంది రవికి. అక్కడికీ ఈయన సంగతి తెలిసి ఈ వార్డులో పోస్టింగ్ పడిన దగ్గర్నుండి మామూలు కంటే త్వరగా వస్తున్నాడు. అయినా ఈయనతో చీవాట్లు తప్పవు. తెల్లారకుండానే వార్డుకొచ్చి కూర్చుని ప్రాణాలు తీస్తాడు.

"సిస్టర్! ముందు రౌండ్స్ చేద్దాం పదండి" ముఖం ముటముట లాడించుకుంటూ స్టెత్, టేప్, నీ-హేమర్, పెన్‌టార్చి మొదలైన సర్వసరంజామాలతో, సమస్త సన్నాహాలతో రౌండ్స్‌కి బయల్దేరాడు రంగనాధరావు. 'యీ వార్డుచీఫ్ రిటైరయి ఆరు నెల్లయినా ఇంకా బలాబలాలు తేలక ఎవర్నీ పోస్ట్ చెయ్యలేదు. సీనియర్ అసిస్టెంట్‌వి, నీదేరాజ్యం. స్వామీ! నీ ప్రభుత్వంలో ఊపిరాడనివ్వకుండా చంపేస్తున్నావు కదయ్యా!' అనుకుంటూ రవి రంగనాధరావుని అనుసరించాడు.

"ఎలా వుందోయ్!" చిరునవ్వు చిందిస్తూ, ముఖాన్ని ప్రసన్నంగా పెట్టి అడుగుతున్న అసిస్టెంట్‌ని ఆశ్చర్యంగా చూచాడు రవి. ఒక్క క్షణంలో దుర్వాస మహాముని అవతారం చాలించి బుద్ధభగవానుడి అవతారంలోకి ఎలా వచ్చాడీయన అనుకున్నాడు రవి.

"డాక్టర్! ప్లీజ్ నోట్‌డన్ ది ఇన్వెస్టిగేషన్స్" రంగనాథరావు చెప్తుంటే కేస్‌షీట్‌లో వ్రాయసాగాడు రవి. ఆ లిస్ట్ వ్రాస్తూ పేషెంట్ వైపోసారి చూచాడు రవి. ఈ పరీక్షలన్నిటికి సరిపడా రక్తం వుందా ఇతని ఒంట్లో అనిపించింది. ఈయన మరీ ఛాదస్తం పంతులు. ప్రతి పేషెంట్‌కి హాస్పిటల్లో చెయ్యగలిగిన టెస్ట్‌ అన్నీ చేయిస్తేగాని నిద్రపట్టదు.

"ఎందుకు సర్ యీ టెస్ట్‌ అన్నీ? క్లినికల్‌గా డయాగ్నోసిస్ బాగానేతెలుస్తూంది కదా!" ఒకరోజు రూమ్‌లో కూర్చుని ఆయన ప్రసన్నంగా మాట్లాడుతున్నప్పుడు అడిగాడు రవి. రౌండ్స్ చేసేప్పుడు పేషెంట్ విషయంలో ఏ చిన్నపొరపాటు, లేక అలక్ష్యం చేసినా క్షమించక సింహరాజులా గర్జిస్తూ తిట్టేసే డాక్టర్ రంగనాథరావు రూమ్‌లో కూర్చున్నప్పుడు సింహరాజు అవతారం చాలించి ఒక మంచి మిత్రుడిలా ప్రవర్తిస్తాడు. అంచేత రవి ప్రశ్నకు సమాధానం మృదువుగానే వచ్చింది.

"మన క్లినికల్ డయాగ్నోసిస్ మీద నమ్మకముంచుకోవడం మంచిదే.కాని ప్రతి పేషెంట్‌కి అవసరమైన అన్ని టెస్ట్‌ చేయించి ఆ రిపోర్టుల్ని కూడా చూచి నా డయాగ్నోసిస్‌ని కన్ఫర్మ్ చేసుకుంటే గాని నాకు తృప్తి వుండదు. డయగ్నోసిస్ కరెక్ట్‌గా వున్నప్పుడే కదా కరెక్ట్ ట్రీట్‌మెంట్ యివ్వగలిగేది? అయినా జనరల్ హాస్పిటల్లో ఇన్ని డిపార్ట్‌మెంటులు, ఇన్నిన్ని విలువైన పరికరాలు వున్నదెందుకు? పేషెంట్‌కు ఉపయోగించడానికే కదా! ఒకోసారి టెస్ట్‌ రిపోర్ట్‌ని బట్టి మన క్లినికల్ డయాగ్నోసిస్‌ని మార్చుకోవలసి రావచ్చు, టెస్ట్‌ చేయించడానికి బద్ధకిస్తే పేషెంట్‌కి ఎంత హాని కలుగుతుంది?" ఆయన వృత్తిలో చూపించే శ్రద్ధ, నిజాయితీల ముందు తలవంచినా, ప్రతి పేషెంట్‌కీ అన్నన్ని పరీక్షలు చేయించాలంటే చిరాకు పుడుతుంది. ఇంతకు ముందు తను పని చేసిన వార్డ్సులో వున్న అసిస్టెంట్స్ ఈయనలాగా కాదు. హాస్పిటల్లో అణువణవులో తాండవిస్తున్న అవినీతి మధ్య తాము చెయ్యదగింది అతి స్వల్పమని గుర్తించి తాము కూడా అందులో ఒక భాగంగా అయిపోయారు. పేషెంట్స్ అంటే అంత సీరియస్‌గా తీసుకోవడం పోయి రొటీన్ వర్క్‌ని అతి కాజువల్‌గా చేస్తున్నారు. కానీ... యీ మహానుభావుడు మాత్రం పేషెంట్స్‌ని పట్టుకుని వ్రేళ్ళాడుతూ హౌస్‌సర్జన్స్ ప్రాణం తీస్తున్నాడు. ఆయన

క్రింద పని చేసిన ప్రతి హౌస్‌సర్జనూ ఆ వార్డ్ పోస్టింగ్ అయ్యాక 'హమ్మయ్య' అని దీర్ఘంగా ఊపిరి తీసుకుంటాడు. ఉదయం ఎనిమిదిన్నర నుండి మధ్యాహ్నం రెండు గంటల దాకా స్టికింగ్ ప్లాస్టర్‌లా వార్డునంటిపెట్టుకుని వుండే ఈ మహానుభావుడు హౌస్‌సర్జన్స్ కాంటీనుకు వెళ్ళి కాలక్షేపం చేస్తేనూ, ఇతర వార్డులో హౌస్‌సర్జన్స్‌గా వున్న ఫ్రెండ్స్‌తో బాతాఖానీ కొడుతూ డ్యూటీని మరిచిపోతేనూ వీరభైరవుడయిపోతాడు.

"వేరీజ్ యువర్ మైండ్ మిస్టర్ రవీ?" కేస్‌షీట్ పట్టుకుని ఆలోచనల్లోకి వెళ్ళిపోయిన రవి రంగనాధరావు ఉరమడంతో ఉలిక్కి పడ్డాడు.

"బీ ఎంటెంటీవ్, డోంట్ డ్రీమ్ ఇన్ ది వార్డ్" కరకుగా అని రెండో నంబర్ బెడ్ దగ్గరకు వెళ్లాడు రంగనాధరావు. వార్డులో ఆయన తిట్లు అలవాటయినా ముఖం చిన్నబుచ్చుకుని ఆయనని అనుసరించాడు రవి. ఒక్కో పేషెంట్‌ని ప్రశ్నిస్తూ, పరీక్షిస్తూ, సూచనలిస్తూ ముందుకు సాగుతున్నాడు రంగనాధరావు. పన్నెండయ్యేటప్పటికింకా నాలగో వంతు పేషెంట్స్‌ని చూడాల్సి వుంది. సిస్టర్‌కి, రవికి సహనం చచ్చిపోతున్నా బలవంతాన శ్రద్ధ చూపెడుతున్నారు. రంగనాధరావు మాత్రం అదే చిరునవ్వుతో, అదే ఓర్పుతో, అంతే జాగ్రత్తగా ప్రతి పేషెంట్‌ని పరీక్ష చేస్తున్నాడు. "డాక్టర్!" సిస్టర్ రవిని రహస్యంగా పిలిచింది. మధ్యలో ఈవిడ రహస్యమేమిటని చిరాకు పడుతూ సిస్టర్ వంక చూచాడు రవి. సిస్టర్ వరండా వైపు సైగ చేసి చూపించింది. అటు చూచిన రవి ముఖం వెలిగిపోయి మరుక్షణం ఆరిపోయింది. రవి గర్ల్ ఫ్రెండ్, కాబోయే భార్య డాక్టర్ సునీత అసిస్టెంట్‌కి కనపడకుండా నుంచుని "యీ బందిఖానాలోంచి ఎప్పుడొస్తావు బయటికి.." అన్నట్లు సైగ చేసింది. అసిస్టెంట్‌ని చూపి "ఈ నిరంకుశ ప్రభువు వార్డులో వుండగా మనపప్పులేం వుడకవు" అన్నట్లు సైగ చేసాడు రవి. 'ఖర్మ' అనుకుంటూ అరచేతితో నుదిటి మీద కొట్టుకుని కోపంగా నిష్క్రమించింది సునీత.

దీక్షగా "సిర్రోసిస్ విత్ ఎసైటిస్" పేషెంట్ కడుపులో నిన్నటి మీద ఇవాళ నీరు ఎక్కువయిందా, తక్కువయిందా అని పరీక్షిస్తున్న అసిస్టెంట్ యీ సైగలూ, కళ్ళ భాషలూ గమనించనందుకు వంద నమస్కారాలు అర్పించుకున్నాడు రవి.

త్వరగా పని పూర్తి చేసుకుని తను, సునీత గార్డెన్స్ వైపు వెళ్ళి సాయంత్రం దాకా హాయిగా గడిపేద్దామని ప్లాన్ వేసుకున్నారు.

ఆఫ్తల్మాలజీ అసిస్టెంట్ బహుమంచివాడు, హౌస్‌సర్జన్స్‌ని ఎక్కువ కష్టపెట్టడు.

హౌస్‌సర్జన్స్‌కి, ముఖ్యంగా క్రొత్తగా పెళ్ళయిన లేక తొందర్లో కాబోయే హౌస్‌సర్జన్స్‌కి వుండే గమ్మత్తయిన సమస్యల గురించి క్షుణ్ణంగా తెలిసి సానుభూతితో వ్యవహరించే ఉత్తముడు. పర్మిషన్ అడగని వాడిది పాపం... ఉల్లాసంగా ఇచ్చేస్తాడు. అందుకే సునీత అప్పుడే పని పూర్తిచేసుకుని వచ్చేసింది... ఇదిగో, ఈయనా వున్నాడు...జిడ్డు! పరమ జిడ్డు!!... తనకి ఓ సరదా, సంతోషం లేదు. ఇంకొకళ్ళని సరదాగా గడప నివ్వడు. ఇంటి దగ్గర పెళ్ళాం దగ్గరైనా రెండు జోకులేసి నవ్వుతూ మాట్లాడతాడో లేక ఇలాగే రూల్స్ ప్రకారం డ్యూటీ కాన్షస్‌నెస్‌తో ప్రవర్తిస్తాడో...

"డాక్టర్! సెండ్ ది ఎసైటిక్ ఫ్లూయిడ్ ఫర్ బయోకెమికల్ ఎనాలిసిస్" అన్యమనస్కంగా వున్న రవి వంక తీక్షణంగా చూచాడు రంగనాధరావు.

"ఎస్.. సర్.." అన్నాడు రవి పేషెంట్‌ని శ్రద్ధగా గమనిస్తున్నట్లు ముఖం పెట్టి.

రౌండ్స్ పూర్తయాక రంగనాధరావిచ్చిన సూచనలననుసరించి బ్లడ్స్ తీసి రిక్విజిషన్ ఫార్మ్స్ పూర్తి చేయసాగాడు రవి. ఈపాటికి సునీత తను రానందుకు తిట్టుకుంటూ వుండి వుంటుంది. చకచక ఈ ఫార్మ్స్ పూర్తి చేసి చల్లగా జారుకోవాలి. అంతకీ కాకపోతే రేపు తినొచ్చు ఆయన తిట్టేతిట్లేవో. ఇవాళ సునీత పుట్టిన రోజు. ఇవాళంతా తను సంతోషంగా గడిపేలా చూడాలి... ప్చ్... తను జారుకుందామనుకుంటున్నాడు. కానీ ఈ హిట్లర్ తనని వదలడు. రెండు గంటలలోపు చచ్చినా వార్డు దాట నివ్వడు. వాచ్ చూసుకున్నాడు. రవి. ఇంకా గంట గడిస్తేనే గాని తనకు విమోచన కలిగి సునీత దగ్గరకు చేరలేడు. సునీత! సునీ! మై స్వీట్ హనీ..." సునీత అందమైన రూపం కళ్ళముందు కదిలి స్వప్న సీమల్లోకి తరలిపోయాడు రవి. రిక్విజిషన్‌ఫామ్ మీద పేషెంట్ పేరు వ్రాస్తూఉన్న పెన్ను ఆగిపోయింది.

"డాక్టర్‌గారూ!" ఒకమ్మాయి గాభరాగా పిలుస్తుంటే ఈ లోకంలోకి వచ్చాడు రవి.

"మానాన్న మాట్లాడడంలేదు డాక్టర్ గారూ... వూపిరి పీల్చుకోవడంలేదు" ఏడుస్తూ ఆ అమ్మాయి ఎనిమిదో నంబర్ బెడ్ వైపు చూపించింది.

ఒక్క ఉదుటున లేచి స్టెత్ తీసుకుని అతని దగ్గరకు పరుగెత్తాడు రవి. అబ్బ! పాడు మెడికల్ వార్డు. రోజూ ఏదో ఒక చావు! ఈ చావుల్ని చూడలేక, హృదయ విదారకమైన ఏడుపుల్ని వినలేక ప్రాణం పోతూంది.

పేషెంట్ కనుగుడ్లు పైకిపోయి చలన రహితంగా పడివున్నాడు. ఉండుండి ఒక్కసారి గాఢంగా ఊపిరి తీసుకుంటున్నాడు. నాడి చూడడానికి ప్రయత్నిస్తున్న రవికి నాడి అందలేదు. ఇంతలో స్పెషల్ వార్డులో రౌండ్స్‌కి వెళ్ళిన రంగనాథరావు తిరిగొచ్చాడు. ఏడుపులు విని గబగబ పేషెంట్ దగ్గరి కొచ్చాడు. సిస్టర్ని ఇంజక్షన్స్ తీసుకురమ్మని వాయువేగంతో వెయిన్‌లోనికి ఇంజక్షన్ చేసి, సెలైన్ పెట్టి, డైరెక్ట్‌గా గుండెలోకి 'ఎడ్రినలిన్' ఇంజెక్ట్ చేసి, గుండెను మసాజ్ చేస్తున్నాడు. సిస్టర్ ఆక్సిజన్ ట్యూబ్ ముక్కులో పెట్టింది. ఒక నిమిషం శిలాప్రతిమలా చేష్టలు దక్కి నిలబడి పోయిన రవి రంగనాథరావు ఆజ్ఞల ప్రకారం ఇంజక్షన్స్ చేస్తున్నాడు. అలసిపోయి ఆగిపోతున్న గుండెని, ఊపిరితిత్తుల్ని చైతన్యవంతం చెయ్యడానికి పట్టుదలగా కృషి చేస్తున్నాడు రంగనాథరావు. అరగంటసేపు పేషెంట్... కాదు.. కాదు... రంగనాథరావు మృత్యువుతో హోరాహోరీ పోరాడాక పేషెంట్ నాడి చేతికి తగలడం మొదలు పెట్టి స్థిరంగా వుంది. 'జీవంలేని పేషెంట్ ముఖంలో కొంచెం కళ వచ్చింది.

పేషెంట్ చనిపోవడం ఖాయం. అసలు చనిపోయాడనే అనుకున్నాడు రవి. మెడికల్ వార్డుకు వచ్చాక యిలాంటి చావులు చాలా చూసాడు. పేషెంట్ బ్రతికున్నప్పుడెంత శ్రద్ధగా చూస్తాడో, పేషెంట్ బ్రతికే అశ చాలా స్వల్పమని స్పష్టంగా తెలిసి కూడా పేషెంట్‌ని బ్రతికించడానికి, మృత్యువు కబంధహస్తాల్లోంచి అతన్ని రక్షించడానికి తన శక్తి వంచన లేకుండా ప్రయత్నించే రంగనాథరావుని చూస్తే ఆ క్షణంలో అతని కాళ్ళ మీద సాష్టాంగపడి నమస్కరించాలనిపిస్తుంది. కానీ... ఖరీదైన ఎన్నో మందుల్ని ఫలితం వుండదని తెలిసి కూడా పేషెంట్‌కిస్తూంటే అనవసరంగా వృధా చేస్తున్నాడనిపించింది రవికి. మొన్న నైట్‌డ్యూటీలో ఇలానే ప్రయత్నించి, ఓడిపోయి, విచారంగా కూర్చున్న రంగనాథరావుతో అదే అభిప్రాయం వెలిబుచ్చాడు రవి.

"సర్! పేషెంట్ చనిపోతాడు. లేక చనిపోవడం ఖాయమని తెలిసికూడా ఈ ఖరీదైన మందుల్ని అలా బూడిదలో పొయ్యకుండా ఇతర పేషెంట్స్‌కి ఉపయోగకరంగా వాడొచ్చుగా" ఖస్సుమని ఎక్కడ కరుస్తాడోనని భయంగా రంగనాథరావు వంక చూశాడు రవి. రవి ప్రశ్న విని కళ్ళెత్తిన రంగనాథరావు 'అసలు నువ్వు డాక్టర్ వేనా' అన్నట్లు అతని వంక చూచి, సమాధానం యివ్వడానికి ఇష్టం లేనట్లు అక్కడి నుంచి వెళ్ళిపోయాడు.

"సిస్టర్ ! హీ యీజ్ బెటర్ నౌ... కాసేపు మీరిక్కడే వుండి సెలైన్ ట్యూబ్

స్లిప్ కాకుండా చూడండి. డాక్టర్ రవీ, 'డెకడ్రాన్' ఒన్ సి.సి. యివ్వండి అరగంట పోయాక'' ఆలోచనలలో నుండి బయటపడిన రవి రంగనాధరావు మాటలకు మంత్రముగ్ధుడిలా తలూపాడు. పేషెంట్ తాలూకు వాళ్ళు భక్తిగా, కృతజ్ఞతగా పైనుంచి ఆ దేవదేవుడే దిగి వచ్చినట్లుగా రంగనాధరావు వంక చూస్తున్నారు. పేషెంట్‌ని పలకరించి అతనికి, అతని బంధువులకు ధైర్యం చెప్పి సంతృప్తితో మెరుస్తున్న ముఖంతో రూంలోకి వెళ్ళాడు రంగనాధరావు. రవి అతని వెనకే వెళ్ళాడు. అతని హృదయం వెలిబుచ్చలేని భావపరంపరతో చలించిపోతూంది.

''సర్!'' రవి పిలుపు విని అతని వంక ప్రశ్నార్థకంగా చూశాడు రంగనాధరావు. ''అయామ్ సారీ సర్! మొన్న రాత్రి నేనెంత ఫూలిష్‌గా మిమ్మల్ని అడిగానో యిప్పుడు తెలుస్తూంది. ఇందాక నేను పేషెంట్ పోయాడనే అనుకున్నాను. సమయానికి మీరు రాకపోతే, నాలాగా అలక్ష్యంగా ఊరుకుని ఉంటే అతను బ్రతికేవాడుకాదు'' ఆగాడు రవి. రవి వంక విస్మయంగా చూస్తున్నాడు రంగనాధరావు.

''సర్! ఒక విధంగా, ఒక కోణంలోంచి చూస్తే సైనికుడిదీ, డాక్టరుదీ ఒకటే ధర్మం, 'ఫైట్ అన్ టు ది డెత్...' ఆఖరి శ్వాస తీసుకునే వరకు పోరాడాలి. కాకపోతే ఆఖరి శ్వాస తీసుకోవడమనేది సైనికుడి విషయంలో అతనే. డాక్టరు విషయంలో పేషెంట్... అలాగే ప్రత్యర్థి విషయంలో కూడా. సైనికుడి ప్రత్యర్థి శత్రువు. డాక్టర్ ప్రత్యర్థి మృత్యువు. మృత్యువు తోటి యీ పోరాటంలో ఎన్నోసార్లు డాక్టరు ఓడిపోవచ్చు. కానీ ఒకసారి గెలిచినా అందుకు వెచ్చించే మందుల ఖరీదు, శ్రమ ఖరీదు నిలిచిన ప్రాణం ఖరీదు ముందు ఏపాటివి! సర్! యిప్పటి దాకా మృత్యువుతో చివరి దాకా పోరాడడమే డాక్టరు కర్తవ్యం అన్న ప్రాధమిక సూత్రాన్ని తెలుసుకోకుండా ఇంత బాధ్యతారహితంగా ఆలోచిస్తూ వున్నందుకు నన్ను నేను క్షమించుకోలేకపోతున్నాను. ప్రాణాల్ని నిలబెట్టాల్సిన వృత్తిని చేపట్టిన నేను ప్రాణం విలువ తెలుసుకోకుండా మిమ్మల్నంత సిల్లీగా ప్రశ్నించినందుకు సిగ్గుపడు తున్నాను.'' ప్రవాహంలా సాగిపోతున్న రవి మాటలు వింటూ... పశ్చాత్తాపంతో దగ్ధమౌతున్న అతని స్వరాన్ని గుర్తించి, రంగనాధరావు రవి భుజంమీద ఆప్యాయంగా తట్టాడు.

'స్నేహ' *1980.*